ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
బుధవారం 09 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:18



## పింఛన్ల పేరుతో మహిళలను అవమానించారంటూ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి యత్నం

-14వ వార్డు కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

2



# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యల ఖండన

## - మల్యాల లో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



**మల్యాల, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞాపన పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మ దహనం చేసి తనపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... దళిత వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉండటం జీర్ణించుకోలేకనే ప్రత్యర్థులు అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దళిత సీఎం, మూడెకరాల భూమి, దళిత బంధు హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆరోపించారు.

# తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి



## - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల రాజు

**ముస్తాబాద్, సెప్టెంబర్ 8: (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్, దళిత రత్నం గౌరవనీయులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అసెంబ్లీ వెలుపల బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపిస్తున్న అభ్యంతరకర, అవమానకర వ్యాఖ్యలను నిరసిస్తూ ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌ను, ఒక దళిత నాయకుడిని ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు ఉపయోగించిన అసభ్యకర భాష సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. అణగారిన వర్గాలకు చెందిన నాయకులు ఉన్నత పదవుల్లో కొనసాగడాన్ని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తమ అహంకారాన్ని, దళిత వ్యతిరేక వైఖరిని బయటపెట్టుకుంటున్నారని ఆరోపించారు.



# తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

స్పీకర్ వ్యవస్థను, దళిత నాయకుడి గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని అన్నారు.ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ, గౌరవనీయ స్పీకర్ పై, వారి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును బీఆర్ఎస్ పార్టీ తక్షణమే బేషరతుగా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజానికి, దళిత సమాజానికి బీఆర్ఎస్ అధిష్టానం బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కోరారు.కొండం రాజిరెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య విలువలను అవమానించేలా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాలనైనా కాంగ్రెస్ పార్టీ తిప్పికొడుతుందని నాయకులు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---



# పింఛన్ల పేరుతో మహిళలను అవమానించారంటూ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి యత్నం

మొదటిపేజీ తరువాయి

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి;**

పింఛన్లు ఇప్పిస్తామని ఆశ చూపి మహిళలను పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి అవమానించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. 14వ వార్డు కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనతో మంగళవారం పెద్దపల్లిలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళలకు నెలకు రూ.2,500 పింఛన్ వస్తుందని, దరఖాస్తు చేసుకునేందుకు ఇదే చివరి తేదీ అంటూ ఆశ చూపి కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి డ్రామాలు ఆడారని కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో మహిళలు తీవ్రంగా అవమానానికి గురయ్యారని ఆయన ఆరోపించారు. దీనికి నిరసనగా అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు కలిసి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముట్టడి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అస్లాం పర్వేజ్‌కు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ముట్టడికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేయడంతో చివరకు ఆందోళనకారులు వెనుదిరిగారు. దీంతో కొంతసేపు నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.

---

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యల ఖండన

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం భట్టి విక్రమార్కను డిప్యూటీ సీఎంగా, గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా చేసి దళితులకు సముచిత స్థానం కల్పించిందని, ఎస్సీ వర్గీకరణకు కూడా శ్రీకారం చుట్టిందని తెలిపారు. బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు ఆత్మగౌరవం కోసం గళమెత్తాలని, దళితులపై అవమానాలను కాంగ్రెస్ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

## - రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలి

## - సేంద్రియ, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

## - వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 08 ప్రజా జ్యోతి;**

డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు.డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర



అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు.ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్

**ముస్తాబాద్, సెప్టెంబర్ 8: (ప్రజా జ్యోతి):**

ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, దళితుల ఆత్మగౌరవానికి అవమానకరమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య కార్యకర్తలకు ప్రజాస్వామ్య విలువలు, సభా సంప్రదాయాలపై శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు.దళితుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వ హామీలపై కూడా నాయకులు ప్రశ్నలు సంధించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత బంధు వంటి హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్, యారటి కరుణాకర్, జగ్గు నరేష్, బిళ్లం సామి, దుబ్బాక రాజు, సడుమల బాలయ్య, గంతరాజు నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు వనిత, నల్ల బుచ్చయ్య, తలారి నరసయ్య, మచ్చ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగుతో రైతుకు రూ.3.45 లక్షల ఆదాయం

**ముస్తాబాద్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి):**

నామాపూర్‌లో ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు 15 టన్నుల దిగుబడి సాధించిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఆదర్శ రైతు క్షేత్రాన్ని పరిశీలించి అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ముస్తాబాద్ కు చెందిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఆయిల్ పామ్ సాగులో మంచి దిగుబడి సాధించి ఆదర్శంగా నిలిచారు. సుమారు నాలుగేళ్ల క్రితం ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి, శాస్త్రీయ పద్ధతుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం 15 టన్నుల దిగుబడి సాధించి రూ.3.45 లక్షల ఆదాయం పొందారు. ప్రస్తుతం మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు.ఈ సందర్భంగా రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ మొక్కల పెరుగుదల, దిగుబడి తదితర అంశాలను పరిశీలించిన కలెక్టర్.. తదుపరి పంట ఎప్పుడు చేతికి వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు.ఆయిల్ పామ్‌ను ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు, మొక్కలను ఎక్కడి నుంచి తీసుకున్నారు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, సస్యరక్షణ చర్యలు, పెట్టుబడి, దిగుబడి, ఆదాయం తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మంచి దిగుబడి సాధిస్తున్న రైతును అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులు దీర్ఘకాలికంగా ఆదాయం సమకూర్చే ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తొలి మూడు సంవత్సరాల్లో ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు అంతర పంటలుగా కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.ఆయిల్ పామ్ సాగులో



కోతుల బెడదతో పాటు చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ ధర రూ.24,025గా ఉందని తెలిపారు. జిల్లాలో నామాపూర్, బోయినపల్లి, నేరెళ్ల, సిరిసిల్ల ప్రాంతాల్లో ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. ఇక్కడ సేకరించిన ఆయిల్ పామ్ ఉత్పత్తులను సిద్ధిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు వస్తే అవసరాన్ని బట్టి మరిన్ని ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. అనేక ప్రయోజనాలు, దీర్ఘకాలిక ఆదాయం ఉన్న ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నామాపూర్‌కు చెందిన రైతు ఆయిల్ పామ్‌తో పాటు ప్రస్తుతం మామిడి, నిమ్మ తోటలను సాగు చేస్తున్నారని, తద్వారా భవిష్యత్తులో మరింత ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు హాజరుకావాలి

- 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలి:
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ముస్తాబాద్, సెప్టెంబర్ 7: (ప్రజా జ్యోతి):**

ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. హియరింగ్‌కు హాజరయ్యే సమయంలో ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానితో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను తీసుకురావాలని తెలిపారు.ముస్తాబాద్ మండలం చీకోడులో మంగళవారం ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహించిన హియరింగ్ సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, ఓటర్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లు ఎంతమంది ఉన్నారు, కొత్త ఓటర్లుగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే వివరాలను ఆమె ఆరా తీశారు.మండల పరిధిలో మొత్తం 7,005 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో హియరింగ్ సమావేశాలను



నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) తమ పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్లకు సమాచారం అందించి, వారు హియరింగ్‌కు హాజరయ్యేలా చూడాలని సూచించారు. తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, ఆర్డీవో శ్రీధర్ బాబు, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**వేములవాడ,సెప్టెంబర్,8:ప్రజాజ్యోతి.**

ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో నిర్వహించనున్న “చలో హైదరాబాద్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేములవాడ పెన్షనర్ల సంఘం పిలుపునిచ్చింది.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల భవనంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.ఐకాస పిలుపు మేరకు ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో వేములవాడ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు తడగొండ సత్తయ్య, జిల్లా అధ్యక్షులు బోయినపల్లి శ్రీహరి, వేములవాడ ప్రధాన కార్యదర్శి ఆనంద్ చారితో పాటు సత్తయ్య, తిరుపతి, దేవయ్య, అంజయ్య, రవీందర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



# ముస్తాబాద్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి: మల్లారపు సంతోష్ రెడ్డి

**ముస్తాబాద్, సెప్టెంబర్ 8: (ప్రజా జ్యోతి):**

భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు సౌల్లా క్రాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ‘వికసిత్ భారత్ సంకల్పం’లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ప్రజల పక్షాన పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, మెంగని మహేందర్, వరి



వెంకటేష్, చిగురు వెంకన్న, మీస స్వామి, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, మర్గల వేణు, మీస కర్ణాకర్, మల్లేశం, యాదగిరి, నర్సింలు, తిరుపతి, వినయ్‌తో పాటు బూత్ కమిటీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనంతారం లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత

## యూరియా యాప్ ల్లో కాదు షాప్ ల్లో దొరకాలి

**ఇల్లంతకుంట సెప్టెంబర్8(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట  మండలంలోని అనంతారం గ్రామంలో మంగళవారం రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడాన్ని నిరసిస్తూ గ్రామ బి ఆర్ ఎస్ నాయకులు మాజి సర్పంచ్ బొల్లం వెంకటేశం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ  సందర్భంగా వెంకటేశం  మాట్లాడుతూ గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్బండ వర్ణాల అభివృద్దే లక్ష్యం గా పాలన కొనసాగిందన్నారు. నేడు రైతులు అరిగోసలు పడుతున్నారని యూరియా కావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, యూరియా ను యాప్ ల్లో కాదు షాప్ ల్లో పెట్టి అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ మాజి డైరెక్టర్ వొల్లాల రవీందర్, మున్నూరు కాపు సంఘం మాజి అధ్యక్షుడు ఆకుల శ్రీను, గ్రామ శాఖ మాజి అధ్యక్షుడు ఎలుక రాజయ్య, సీనియర్ నాయకులు గరిగే సత్యనారాయణ, బట్టి నర్సయ్య, దారవేణి శ్రీను, పురుషోత్తం భాస్కర్, దారవేణి నాగరాజు, బొల్లం పరశురామ్, ఎలుక నర్సయ్య, రాజు, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు



ప్రజాజ్యోతి

బుధవారం 09 సెప్టెంబర్ 2026

# ప్రజా సమస్యలపై గళమెత్తితే అరెస్టులా?

## - ప్రతిపక్ష గొంతును నొక్కే కుట్రలు సాగవు

## - కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నేత సంపత్‌రావు ఫైర్

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):**

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల తరపున గళమెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను అర్ధరాత్రి,తెల్లవారి జామున వేళ పోలీసులు అదుపులోకి తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత,నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుంకిశాల సంపత్‌రావు తీవ్రంగా మండిపడ్డారు.కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సంపత్‌రావు,పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి,ఇరుకుల్ల సర్పంచ్ బుర్ర రమేష్‌గౌడ్,తహేర్ కొండాపూర్ సర్పంచ్ గిరి,దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి,గాదె శ్రీనివాస్,బాల్‌రాజు,తిరుపతి, కుమార్‌లను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం,వాటిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు పోలీసులను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే కేసులు,అరెస్టులు,నిర్బంధాలతో భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.ప్రశ్నించే గొంతును అరెస్టు చేయగలరేమో కానీ ప్రజల ఆకాంక్షలను అరెస్టు చేయలేరని పేర్కొన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్ష నాయకులపై ఒత్తిళ్లు, బెదిరింపులు,పోలీసు చర్యలతో ప్రజా ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని,రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ, ప్రతిపక్ష నాయకుడికీ ఉందని పేర్కొన్నారు,అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులందరినీ




ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వంపై మరింత తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

**చొప్పదండి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బిఆర్ఎస్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ నాయకులు చొప్పదండి పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మహాధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యం లో ఈ కార్యక్రమం చేపట్టారు.మాజీ ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ స్పీకర్ పై ఇష్టారీతిన మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధు ను పదవి నుండి పూర్తిగా తీసివేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పక్ష నాయకుడు, బిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని,ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తాత మధు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. కార్యక్రమం లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజనపురం చందు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

## - గ్రామాల్లో నెలకున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: రూరల్ సర్పంచులు

**వేములవాడ,సెప్టెంబర్,08:ప్రజాజ్యోతి.**

వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల ప్రగతితో పాటు నిధుల వినియోగంపై అధికారులు సుదీర్ఘంగా సమీక్షించారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, చివరి లబ్ధిదారుడి వరకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు.వానాకాలం తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడటంతో పాటు పారిశు



ధ్య నిర్వహణను పక్కాగా చేపట్టి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు వహించాలని నిర్ణయించారు. నిరంతర విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పనుల ప్రగతిపై శాఖల వారీగా పూర్తి వివరాలను అధికారులు సభకు వివరించారు. ఈ సందర్భంగా పలు




గ్రామాల నుంచి హాజరైన సర్పంచులు తమ పరిధిలోని డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి కొరత మరియు రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకువచ్చారు.సర్పంచులు లేవనెత్తిన ప్రతి సమస్యపై ఎంపీడీవో మరియు సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో సాగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల రూపురేఖలు మార్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం, తహసీల్దార్ అబూబకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజంలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు దారుణం

## - వెంటనే అనర్హుడిగా ప్రకటించాలి

## - మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్తూరి మహేష్ డిమాండ్

**చొప్పదండి, సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి:**

స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు దారుణం అని, అనర్హుడిగా ప్రకటించాలని చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ డిమాండ్ చేశారు.తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన నీచమైన, అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన పీఠంపై ఉన్న స్పీకర్ ను ఎమ్మెల్సీ తాతా మధు ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక వైఖరికి, అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో దళిత నాయకత్వం ఎదుగుతుంటే చూసి ఓర్వలేక రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడటం బీఆర్ఎస్ సంస్కారహీనతకు పరాకాష్ట అని అన్నారు. స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటం అందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని, ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.సభా ప్రాంగణంలో సభాపతిని, ఆయన కుటుంబ సభ్యులను అవమానిస్తూ మాట్లాడటం తీవ్రమైన నేరమని, ఇది కేవలం దళితులకు కాదు 4 కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని, తెలంగాణ చరిత్రలో ఇది చీకటి రోజని అన్నారు. భారతదేశ చరిత్రలో ఏ చట్టసభల్లోనూ ఇలాంటి హేయమైన సంఘటన జరగలేదని పేర్కొన్నారు.సభా మర్యాదను కించపరిచిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే అనర్హుడిగా ప్రకటించాలని, అసెంబ్లీకి రాకుండా ప్రోత్సహించిన ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని అన్నారు.



# బండంకల్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్స్ పంపిణీ

**ముస్తాబాద్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి):**

ముస్తాబాద్ మండల్ బదనకల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, గ్రామ సర్పంచ్ చిగురు నరేష్, ఏపీపీసీ చైర్‌పర్సన్ సద్ది మంజులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేసి, పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# గూడెంలో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ముస్తాబాద్, సెప్టెంబర్ 8: (ప్రజా జ్యోతి):**

ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా గూడెం గ్రామంలో ఆరు బ్లాకుల్లో జీ+ విధానంలో నిర్మించిన మొత్తం 48 ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా ఇళ్లలో ప్రస్తుతం ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయి, వారికి అందుతున్న మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలు సక్రమంగా అందు తున్నాయా అనే విషయాలను ఆరా తీశారు.అనంతరం డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అలాగే ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. గ్రామ ప్రజలకు నీటి సౌకర్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు, గూడెం గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై పోలీసుల దాడి..

## - రూ.3,090నగదు,నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం

**ధర్మారం, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

మేడారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడి నిర్వహించారు. పోచమ్మ బోరు వెనుక పేకాట ఆడుతున్న ఎల్తూరి పవన్, చీకట్ల కుమార్, కడారి అరుణ్, బొంకూరి మొండయ్యలను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,090 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఇ. శ్రీకాంత్ తెలిపారు.అదే సమయంలో పోలీసులను గమనించిన మేడారం అజయ్, బొద్దు మహేందర్, ఎల్తూరి నివాస్, బొంకూరి మహేందర్ అక్కడి నుంచి పరారైనట్లు ఎస్సై పేర్కొన్నారు. పరారైన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.



# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలి

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై పవిత్ర

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా సాధించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సూపర్వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ఆశా కార్యకర్తల నుంచి వైద్యాధికారుల వరకు ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ప్రగతి నివేదికలను సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా సిబ్బందికి తగిన సూచనలు చేశారు.వర్షాకాలంలో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, రక్త విరేచనాలు, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్ వంటి సంక్రమిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయడంతో పాటు, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యాధికారుల పర్యవేక్షణలో తగిన చికిత్స అందించాలని సూచించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు.క్షయవ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి వ్యక్తికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స అందించాలని డాక్టర్ పవిత్ర సూచించారు. ప్రజల్లో క్షయవ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టిఇన్‌చార్జి మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ లక్ష్మీ భవాని మాట్లాడుతూ గర్భిణులు నమోదు చేసుకున్న వెంటనే వారికి అందించాల్సిన ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. గర్భిణులు, శిశువులకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయంలో అందించాలని, ప్రతి గర్భిణి వివరాలు, అందించిన సేవలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.14 నుంచి 15 సంవత్సరాల లోపు ప్రతి బాలికకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ ముఖద్వార



క్యాన్సర్ ముప్పును తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంజనేష్ కుమార్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, చికిత్స వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీపీహెచ్‌ఎన్‌ఓ శ్రీమతి దయామని, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనిల్ కుమార్, సామాజిక ఆరోగ్య అధికారులు, సూపర్వైజర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

---

# ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం వేడుకలు

**వేములవాడ,సెప్టెంబర్,08:ప్రజాజ్యోతి.**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హనుమాజీపేటలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించడం జరిగింది.
అక్షరాస్యత అవశ్యకతను అక్షరాస్యతా వలన కలిగే లాభాలను గురించి కార్యక్ర మంలో ఉపాధ్యాయులు సతీష్ కిరణ్ విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు అమృతలాల్ ఉపాధ్యాయులు జగన్నాథ చారి సరోజ భవిత అరుణ పాల్గొన్నారు విద్యార్థులను వారికి ఇష్టమైన పుస్తకాలను చదివించడం జరిగింది. కార్య క్రమం ఆహ్లాదకరంగా జరిగింది.



# ప్రజాస్వామ్యంలో మహిళలకు ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే గౌరవం..?

## - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

## - మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళన

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి:**




అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో మహిళలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మమతా రెడ్డి పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీకి వచ్చిన మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల పట్ల గౌరవంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం, పోలీసులతో వారిని అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. మహిళలకు గౌరవం, భద్రత కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు మహిళా ప్రజాప్రతినిధులపైనే పోలీసుల బలప్రయోగానికి పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి, ప్రభుత్వం బాధ్యత వహించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేరని అన్నారు. పోలీసుల అండతో ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మమతా రెడ్డి మాట్లాడుతూ మహిళలకు పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను అవమానించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దురుసు ప్రవర్తనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఒక్కటై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ లేకుండా చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట విజయవంతం

## - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన “పోరుబాట” కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, స్కూటీలు, రైతు భరోసా, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, కళ్యాణలక్ష్మి తదితర అంశాలపై కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, కార్మికులు, నిరుద్యోగులతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మౌలిక వసతుల సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పోరుబాటలో వివిధ వర్గాల సమస్యలు, ఆరు గ్యారంటీల అమలు వైఫల్యం, స్థానిక సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని, అవసరమైతే మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని మనోహర్‌రెడ్డి హెచ్చరించారు. పోరుబాటను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



**అంబేద్కర్ విగ్రహానికి వినతి**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో 420 హామీల అమలులో జాప్యం, ఆరు గ్యారంటీల విస్మరణపై నిరసనగా దాసరి మనోహర్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

# నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

## - మహిళలను చూడకుండా చిత్రహింసలకు గురిచేయడం సిగ్గుచేటు
## - ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్
## - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో అమలు కాని 420 హామీలు, ఆరు గ్యారెంటీలపై అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిల పట్ల పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ ఆడబిడ్డల వివాహాల కోసం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని ఆరోపించారు. విద్యార్థుల పైచదువుల కోసం రూ. 5 లక్షల ఏటీఎం కార్డులు, యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మహిళలను గౌరవిస్తామని చెప్పిన ప్రభుత్వం వారిపైనే బలప్రయోగం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, ఎన్నికల హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తుండగా ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని ఆరోపించారు. పెద్దపల్లి పట్టణంలో బస్సు డిపో నిర్మాణం వల్ల ట్రాఫిక్, శబ్ద కాలుష్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున డిపోను పట్టణానికి బయట ఏర్పాటు చేయాలని డిమాండ్



చేశారు. బస్టాండ్ సమీప ప్రాంతాన్ని ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు లేదా జిల్లా కోర్టు వంటి ప్రజోపయోగ సంస్థల ఏర్పాటుకు వినియోగించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పింఛన్ల పెంపు, రోడ్లు, చెరువుల అభివృద్ధి, గృహ నిర్మాణం వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో సుమారు 950 ఇళ్ల నిర్మాణంతో పాటు పెద్దపల్లిలో ఇళ్ల నిర్మాణం, కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా బీఆర్ఎస్ నాయకులు వెనక్కి తగ్గబోరని, ప్రజలు, మహిళల తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బీర్‌పూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన ఈఓగా డి. కిరణ్ బాధ్యతల స్వీకరణ

**బీర్‌పూర్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన పూర్తిస్థాయి కార్యనిర్వాహణాధికారిగా డి. కిరణ్ మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు జగిత్యాల జిల్లా నల్లగొండ దేవాలయం ఈఓగా విధులు నిర్వహిస్తున్న డి. కిరణ్‌ను, బీర్‌పూర్ ఆలయ పూర్తిస్థాయి ఈఓగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం ఆలయ కార్యాలయంలో ప్రస్తుత ఈఓ ఎస్. శ్రీనివాస్ నుంచి ఆయన అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన ఈఓ కిరణ్‌కు ఘనంగా స్వాగతం పలికారు.





# ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాల నమోదును సమర్ధవంతంగా నిర్వహించాలి

## - డేటా నమోదులో వేగం, ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**
అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యూపీహెచ్‌సీ)లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాల నమోదును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో యూపీహెచ్‌సీ ఏఎన్‌ఎంలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీల నమోదు, టీకాలు, కుటుంబ సంక్షేమం, ప్రజారోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ట్యాబ్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో సేకరించే ఆరోగ్య సమాచారాన్ని సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వేగంతో పాటు డేటా ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆన్‌లైన్ డేటా ఆధారంగా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించే అవకాశం ఉన్నందున ప్రతి వివరాన్ని బాధ్యతగా నమోదు చేయాలని సూచించారు. ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆరోగ్య కార్యక్రమాల అమలులో పారదర్శకత, ఖచ్చితత్వం పెంచాలని అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు

# 11న జాబ్ మేళా

## ..18 నుంచి 35 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం

## జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్



**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**
నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం, టాస్క్ రీజినల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. పెద్దపల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని బస్ డిపో ప్రాంగణంలోని పాత ఎంపీడీవో కార్యాలయ టాస్క్ రీజినల్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. ఎల్ఎన్ ఎలక్ట్రానిక్స్ గ్రూప్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ సంస్థలు పాల్గొని వివిధ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఎన్ ఎలక్ట్రానిక్స్‌లో అసెంబ్లీ ఆపరేటర్లు, ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్లు, అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్ల పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీ.ఫార్మ్, ఎం.ఫార్మ్ తదితర విద్యార్హతలు కలిగి 1835 ఏళ్ల వయస్సు ఉన్నవారు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని, ఉద్యోగ నియామక ప్రదేశాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు అప్‌డేటెడ్ రెజ్యూమ్ రెండు కాపీలు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, అనుభవ ధ్రువపత్రం ఉంటే దానితో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182117078, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు.

# బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు




**జమ్మికుంట, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**
కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలపై అసెంబ్లీలో ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళనకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాల మేరకు జమ్మికుంటలో నిరసనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావిద్, కౌన్సిలర్లు పొనగంటి రాము, చింతల శీను, కొలువురి సురేష్, ఎం.ఏ. ఫిరోజ్, మంద రాజేష్, పోలినేని వేణురావు, పోలు బిక్షపతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.డి. జానీ, బండారి ప్రశాంత్ తదితరులను అరెస్టు చేశారు. శాంతియుత నిరసనను అడ్డుకుని అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారి సోమిడి నిషిర



**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:**
పెద్దపల్లి పట్టణానికి చెందిన సోమిడి షాలిని నటరాజ్ కుమార్తె చిన్నారి సోమిడి నిషిర తన ప్రతిభతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అవార్డు అందుకుంది. చిన్న వయసులోనే శ్లోకాలు, తెలుగు, ఇంగ్లీష్ రైమ్స్‌తో పాటు మానవ శరీర భాగాల పేర్లను స్పష్టంగా, చక్కగా చెప్పినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి అవార్డును చిన్నారి నిషిరకు అందజేసి అభినందించారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. నిషిర సాధించిన ఈ విజయంపై తల్లిదండ్రులు సోమిడి షాలిని నటరాజ్, నానమ్మ మహేశ్వరి, తాత అక్కపాక తిరుపతి, అమ్మమ్మ మమతతో పాటు అక్కాచెల్లెళ్లు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారిని అభినందించారు.

# దళిత స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకోం

## - అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం.. తాతా మధు దిష్టిబొమ్మ దహనం

**ధర్మారం,సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ధర్మారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా,రాస్తారోకో నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రూప్లా నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "దళితులతో చెలగాటమా.. ఖబడ్దార్ కేసీఆర్" అంటూ నినదిస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, విగ్రహాన్ని నీటితో శుద్ధి చేశారు. తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవిలో ఉన్న దళిత నాయకుడిని ఏకవచనంతో, అసభ్య పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా అభివర్ణించారు.అధికారం కోల్పోయిన అక్కసుతో బీఆర్‌ఎస్ నాయకులు హద్దులు మీరి మాట్లాడుతున్నారని, దళితుల గౌరవాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదని ఘాటుగా విమర్శించారు.అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద బీఆర్‌ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పోలీసులతో జరిగిన తోపులాట సమయంలో తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దళితుడైన స్పీకర్‌ను అవమానించడం ద్వారా బీఆర్‌ఎస్ తన దళిత వ్యతిరేక వైఖరిని మరోసారి బయటపెట్టిందని మండిపడ్డారు.తాతా మధు వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని ఉద్దేశించినవి కావని, యావత్ దళిత సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని కాంగ్రెస్, దళిత నాయకులు పేర్కొన్నారు. తాతా మధు వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాసన మండలి కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమంలో డీసీసీబీ ప్రధాన కార్యదర్శి గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కార్యదర్శి కొత్త నరసింహులు, మాజీ ఎంపీపీ కొడారి హనుమయ్య, మాజీ వైస్ ఎంపీపీ మేడవేణి తిరుపతి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశం, అరిగే లింగయ్య, చింతల ప్రదీప్ రెడ్డి, మాజీ వీఎస్ఎస్ చైర్మన్ దేవి జనార్ధన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోద అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, చైర్మన్ పోలు దాసరి సంతోష్, పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుమ్మల తిరుపతి, ఓరేం చిరంజీవి, సర్పంచులు ధార రాజ్ కుమార్, కాల్వ మల్లయ్య, బంగుటపు కొమురయ్య, వాగ్యా నాయక్, నాయకులు దాగేటి ఉదయ్, వేల్పుల నాగరాజు, ఉప సర్పంచ్ ఎలిగేటి మల్లేశం, మాజీ డైరెక్టర్ కాంపల్లి రాజేశం, ఏదుల్ల అంజయ్య, సూర వెంకటేశం, కాంపెల్లి పోచయ్య, ఈదుల శ్రీనివాస్, దేవి కిషోర్, దూడ తిరుపతి, జనగామ తిరుపతి, దేవి లావణ్య, కంసాని ఎల్లయ్యతో పాటు వివిధ గ్రామాల మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# ఉద్యోగాల పేరుతో రూ.44 లక్షల టోకరా

## - శాతవాహన యూనివర్సిటీ పేరుతో నిరుద్యోగులకు వల
## - 21 మంది నుంచి నగదు వసూలు.. ప్రధాన నిందితుడు అరెస్ట్
## - మరో ఏడుగురి కోసం పోలీసుల గాలిం

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):**

శాతవాహన యూనివర్సిటీతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ముఠా గుట్టును కరీంనగర్ టూటౌన్ పోలీసులు రట్టు చేశారు.డేటా ఎంట్రీ ఆపరేటర్,రికార్డు అసిస్టెంట్,టెక్నికల్ బుక్ కీపింగ్,జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సుమారు 21 మంది నుంచి రూ.44 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

### కుమార్తెకు ఉద్యోగం పేరుతో మోసం...

విద్యానగర్‌కు చెందిన పురుషోత్తం మమతకు దుడపాక తిరుపతి అలియాస్ తిరుపతిరావు పరిచయమయ్యాడు. తాను శాతవాహన యూనివర్సిటీలో బోధకుడిగా పనిచేస్తున్నానని చెప్పి, ఆమె కుమార్తెకు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు.ఇందుకోసం రూ.1.50 లక్షలు డిమాండ్ చేయగా బాధితురాలు రూ.65 వేలు నగదుగా,మరో రూ.85 వేలను నిందితుడి భార్య దుడపాక లావణ్య ఖాతాకు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.తర్వాత ఆమె కుమార్తె రికార్డు అసిస్టెంట్‌గా ఎంపికైనట్లు నకిలీ నియామక పత్రాలు ఇచ్చాడు.ఈ విషయం తెలుసుకున్న బంధువులు కూడా నిందితుడిని సంప్రదించగా,వారికి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.8.50 లక్షలు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

### నకిలీ పత్రాలతో నమ్మబలికాడు...

నిందితుడు తనకు ఉన్నతాధికారులతో పరిచయాలు,పలుకుబడి ఉన్నట్లు చెప్పి నిరుద్యోగులను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు.ఉద్యోగ నియామక ప్రక్రియ నిజమైనదిగా కనిపించేలా నకిలీ ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు,సర్టిఫికెట్లు,నియామక ఉత్తర్వులు తయారు చేసినట్లు గుర్తించారు.వరంగల్,గోదావరిఖని,నిజామాబాద్ ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులను కూడా ఈ వ్యవహారంలో ఉపయోగించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

### 21 మంది నుంచి రూ.44 లక్షలు...

2025 అక్టోబరు నుంచి 2026 జనవరి వరకు కరీంనగర్ విద్యానగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ నిందితుడు ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.వివిధ ఉద్యోగాల పేరుతో సుమారు 21 మంది నుంచి రూ.44 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది.

### ప్రధాన నిందితుడు అరెస్ట్...



కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఆదేశాల మేరకు కరీంనగర్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ సి. స్వప్నిల్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తీర్ల ప్రకాష్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ప్రధాన నిందితుడు దుడపాక తిరుపతి అలియాస్ తిరుపతిరావు (51)ను అరెస్టు చేశారు.అనంతరం కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

### ఏడుగురు పరారీ...

ఈ కేసులో నర్సింహమూర్తి,కోలా వెంకటేశ్వర్‌రావు,దుడపాక లావణ్య,ఈట్ల సత్యం,రాజశేఖర్,అంజయ్య,బొల్లా నాగరాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

### పోలీసుల సూచన...

ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని పోలీసులు సూచించారు. ఉద్యోగ నియామక పత్రాలు,నోటిఫికేషన్లను సంబంధిత సంస్థల అధికారిక వెబ్‌సైట్లు లేదా కార్యాలయాల ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాతే నమ్మాలని కోరారు.ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వారి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## జానపద కళను కాపాడడంలో. మొగిలి సదానందం కు మరొకరు సాటిరారు

### - ప్రభుత్వ విప్పు చింతకుంట విజయరమణారావు.

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి)**

పల్లెల్లో గల జానపద పాటలను కాపాడడంలో మొగిలి సదానందం కు మరో కరు సాటి రారని ప్రభుత్వ విప్పు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కొనియాడారు. కాలువ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట్ గ్రామానికి చెందిన. జానపద కళాకారుడు మొగిలి సదానందం. రాసి పాడిన సవ్వాల్ల నడక యూట్యూబ్ సిడి ని ఆయన హైదరాబాదులో తమ కార్యాలయంలో ప్రారంభించారు. పాటలు రాసి పాడిన మొగిలి సదానందమును .విప్పు విజయ రమణారావు తో పాటు పరువులు ప్రజాప్రతినిధులు .మాజీ ప్రజాప్రతినిధులు. తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గోపగోని సారయ్య గౌడ్ .కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేణ సదయ్య వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి లతోపాటు. పలువురు. సర్పంచులు. మాజీ సర్పంచులు. కాంగ్రెస్ పార్టీ నాయకులు. తదితరులు పాల్గొన్నారు.



## సుస్థిర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి

- మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సాగు పద్ధతులు మార్చుకోవాలి
- ఆధునిక సాంకేతికతను జోడించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి
- భూసారాన్ని కాపాడుకుంటూ లాభసాటి సాగు దిశగా అడుగులు వేయాలి





**వేములవాడ,సెప్టెంబర్,08:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ మరియు ఆత్మ (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ - ఆత్మ ) 2026-27 ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. “వాతావరణ మార్పులకు అనుగుణంగా సుస్థిర వ్యవసాయం మరియు మేలైన వ్యవసాయ సాగు పద్ధతులు“ అనే అంశంపై రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వేములవాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. సాంప్రదాయ పంటల స్థానంలో మేలైన, ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించడం ద్వారా తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్న ప్రస్తుత తరుణంలో భూసారాన్ని రక్షించుకుంటూ సుస్థిర వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ అధికారులు అందిస్తున్న సూచనలు, ఆత్మ సంస్థ ద్వారా లభించే సాంకేతిక శిక్షణను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పంటల మార్పిడి, ఆధునిక యంత్రాల వినియోగం మరియు నాణ్యమైన సాగు విధానాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ డైరెక్టర్స్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకుందాం.

### - జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

**వేములవాడ,సెప్టెంబర్,08:ప్రజాజ్యోతి.**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వ హించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఈ సందర్భంగా వేములవాడలోని మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో వేములవాడ సబ్‌డివిజన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, స్థానిక కౌన్సిలర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...గత ఏడాది నిమజ్జనం సందర్భంగా జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించారని,జిల్లాలో అక్కడక్కడ ఇబ్బందులకు గురి చేసిన వారిపై 8 కేసులు నమోదు చేయడం జరిగిందని,గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలో ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు గణేష్ పోర్టల్2026లో తమ మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని,ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మండపాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి , టీజీ-కాప్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు.జియోట్యాగింగ్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుంటుందన్నారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రూపొందించిన రూట్ మ్యాప్‌ను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు.గణేష్ ఉత్సవాల్లో మండపాలు, శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని,అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల వరకు రెండు చిన్న స్పీకర్లకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.. అలాగే సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, వాస్తవాలు నిర్ధారించుకోకుండా వాటిని ఫార్వర్డ్ చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉండి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తమని హెచ్చరిం చారు..విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని,విద్యుత్ షార్ట్ సర్క్యూట్,అగ్ని ప్రమాదాలు జరగ కుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. అవసరమైన ప్రదేశాల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ బాల్స్, నీటి బకెట్లు అందుబాటులో ఉంచా లన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్స వాలను సంతోషకర వాతావరణంలో నిర్వహించుకునేలా పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్న మని,ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్-112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈసమావేశంలో డిఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పుల్కమ్ రాజు , సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్.ఐ లు , మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు..

## - అధికారుల దృష్టికి వెళ్లడంతో నిలిపివేత





**ధర్మారం,సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి):**

ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణానికి పునాదులు వేయడం కలకలం రేపింది. గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు.ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.దీంతో జిపిఓ సంజీవ్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించి,అక్కడ చేపడుతున్న అక్రమ ఇంటి నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని సంబంధితులకు సూచించారు.ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి పూర్తి వివరాలను తహసీల్దార్‌కు నివేదిస్తానని ఆయన తెలిపారు.ఇదిలా ఉండగా గ్రామంలోని దళితులు, బీసీ వర్గాలకు చెందిన నిరుపేదలకు ప్రభుత్వం భూమి కేటాయించి,ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. పేదలకు ప్రభుత్వ భూమి అందించి ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తే ఎన్నో కుటుంబాలకు సొంతింటి కల సాకారమవుతుందని వారు పేర్కొంటున్నారు.అయితే ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టే ప్రయత్నాలు జరుగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని,అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

### - పోలీస్,మున్సిపల్ శాఖలు సమన్వయంతో నిబంధనలు పాటించేల చూడాలిలిఎస్ పి మహేష్ బి గీతే

### వేములవాడలో గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం





**వేములవాడ,సెప్టెంబర్,08:ప్రజాజ్యోతి.**

వేములవాడ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం పట్టణంలో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ మరియు మున్సిపల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు. భక్తులకు, స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మండపాల వద్ద పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలని, విద్యుత్ విభాగానికి సంబంధించి ముందస్తు భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా శోభాయాత్ర, నిమజ్జనం రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ విధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. వేములవాడ పట్టణ ఆధ్యాత్మికతను చాటిచెప్పేలా ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. మండపాల వద్ద ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి వేళల్లో స్వచ్ఛంద కార్యకర్తల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఊహాగానాలు, సోషల్ మీడియా పుకార్లను నమ్మవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఎస్పి శ్రీనివాసులు, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గణేష్ మండపాల ప్రతినిధులు మరియు ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న హైడ్రా కమిషనర్ - రంగనాథ్

**మల్యాల, సెప్టెంబర్ 08 , ప్రజా జ్యోతి:**

కొండగట్టు ఆంజనేయ స్వామిని హైడ్రా కమిషనర్ ఐపీఎస్ రంగనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.... హైడ్రా యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, కబ్జాలకు గురి అయిన దాదాపుగా 1.50 లక్షల కోట్ల భూములను కాపాడి ప్రభుత్వానికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములు,చెరువులు, కుంటల కబ్జాలు తగ్గాయని, అక్రమ కట్టడాలను కూల్చివేయడంతో అక్రమ కట్టడాలు ఆగాయి అని అన్నారు. హైదరాబాదులోని మూడు నియోజకవర్గాల వరకు విస్తరించి ఉన్న హైడ్రా కార్యకలాపాలను ప్రభుత్వం ఆమోదిస్తే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేస్తామన్నారు.హైడ్రా పై వచ్చిన దుష్ప్రచారాలను ప్రజలు నమ్మకుండా స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలుపుతున్నారని ఆయన తెలిపారు.



కొండగట్టు అంజన్న దర్శించుకున్న హైడ్రా కమిషనర్ ఐపీఎస్ రంగనాథ్.



# ప్రధానరోడ్డుపైనేనిద్రప్రమాదపుటంచున గాల్లోప్రాణాలు!

## - వేములవాడరెండవబైపాస్‌లోసంచారజాతులనిర్లక్ష్యం..

## - ప్రాణాలకు అనుకోని ప్రమా దం జరిగితేఎవరిదిబాధ్యత

**2వేములవాడ,సెప్టెంబర్,08:ప్రజాజ్యోతి.**

పగటి వేళ పొట్టకూటి కోసం శ్రమించి.. రాత్రి కాగానే నిద్రపోయేందుకు రోడ్డునే ఆశ్రయిస్తున్నారు. నిద్రలోకి జారుకున్న వేళ ఏ వాహనం దూసుకొస్తుందో, ఏ క్షణాన ప్రాణాలు గాల్లో కలుస్తాయోనన్న స్పృహ లేకుండా రోడ్డు సగానికి మంచాలు, రోడ్డుపైనే నిద్రిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తీవ్ర ప్రమాదకరంగా మారిన ఈ దృశ్యాలు వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో నిత్యం కనిపిస్తున్నాయి. వేములవాడ రెండో బైపాస్‌లోని భారత్ పెట్రోలియం సమీపంలో సంచార జాతులకు చెందిన పలు కుటుంబాలు తాత్కాలికంగా ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. అయితే వీరు రాత్రి వేళల్లో రోడ్డు సగానికి మంచాలు వేసుకుని, కొందరు రోడ్డుపైనే నేరుగా చాపలు పరిచి నిద్రపోతున్నారు. రాత్రి వేళల్లో ఈ బైపాస్ రోడ్డు మీదుగా భారీ వాహనాలు, లారీలు, కార్లు అతివేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. చీకటి వేళల్లో లేదా మలుపుల వద్ద రోడ్డుపై పడుకున్న వారు డ్రైవర్ల కంటికి చిక్కకపోతే భారీ ముప్పు తప్పదు. ఏమాత్రం వాహనం అదుపుతప్పినా రోడ్డుపై నిద్రిస్తున్న పదుల సంఖ్యలోని ప్రాణాలు గాల్లో కలిసిపోయే పరిస్థితి నెలకొంది. వాహనదారులు ఏమాత్రం అప్రమత్తత కోల్పోయినా తీవ్ర విషాదం చోటుచేసుకునే ప్రమాదం ఉంది. "ఇలా రోడ్డుపై పడుకోవడం వల్ల ఎవరికి ఏ ముప్పు వాటిల్లుతుందోనని వాహనాలు నడపాలంటేనే భయమేస్తోంది" అని పలువురు వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే ఈ నిండు ప్రాణాలకు, వారి కుటుంబాలకు బాధ్యత ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పరిస్థితిని సమీక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై నిద్రిస్తున్న వారికి



ప్రమాద తీవ్రతపై అవగాహన కల్పించి, వారిని అక్కడి నుంచి తరలించి సురక్షితమైన ప్రదేశాల్లో ఆశ్రయం కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు వెంటనే మేల్కొని తగిన నివారణ చర్యలు తీసుకోకపోతే నిండు ప్రాణాలు బలయ్యే అవకాశముందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**ధర్మారం, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు. మంగళవారం పత్తిపాక ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన ప్రార్థన సమావేశం, బోధనా ప్రక్రియ,విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.అనంతరం ప్రభుత్వ ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.కార్యక్రమంలో హెచ్ఎం నూతి మల్లన్న, ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.




# పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన

## - కోనరావుపేటలో MRMA-2.0 కార్యక్రమం







**కోనరావుపేట,సెప్టెంబర్.08 (ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో 'మేరా రేషమ్ మేరా అభియాన్' (వి=హీరా-2.0) ప్రచారంలో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూదీ-జూ=× (మైసూరు) సైంటిస్ట్-ఇ డాక్టర్ మల్లికార్జున జి మరియు ూ=ూ (ములుగు)కు చెందిన డాక్టర్ జి. రాఘవేందర్ ఆధ్వర్యంలో "పంట వైవిధ్యీకరణ మరియు మహిళా సాధికారతలో పట్టుపురుగుల పెంపకం (సెరికల్చర్)" అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏడాది పొడవునా అధిక ఆదాయం పొందే అవకాశాలు, రైతులకు అందించే ప్రోత్సాహకాలు (సబ్సిడీలు) పై నిపుణులు వివరించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో స్నిగ్ధ, మాట్లాడుతూ... రైతులు, స్వయం సహాయక సంఘాల (ూు+) మహిళలు పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ూ జగన్, సర్పంచ్ లు కాశీరాం, సర్పంచ్ స్వామి, మల్లేశం, వైస్ ప్రెసిడెంట్ రేవతితో పాటు 87 మంది రైతులు, 8 మంది అధికారులు పాల్గొన్నారు. మెరుగైన పట్టుపురుగుల పెంపకం పద్ధతులపై రైతులు నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తమ గ్రామాల్లో సెరికల్చర్ చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపారు.

# మోట్లపల్లి పాఠశాల విద్యార్థులకు ఘూలు యూనిఫామ్ లు అందజేత - సర్పంచ్ తుల మనోహర్ రావు

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి)**

కాలువ శ్రీరాంపూర్ మండలంలోని. మోట్లపల్లి గ్రామంలో గల .పాఠశాలలో నీ విద్యార్థులకు ఘూలు యూనిఫామ్ లు. సర్పంచ్ మనోహర్రావు చేతులమీదుగా మంగళవారం రోజున విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి. ఉప సర్పంచ్ సుమలత. వార్డు సభ్యులు పోగుల రమేష్. దోమటి శంకరమ్మ .బెజ్జాల మానస. గాధర్ల శారద. రామ్ దేని రాజేశం. ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి రైతు ఫారంపాండ్ నిర్మించుకోవాలి సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్

## - ఒడ్యాడ్ గ్రామంలో ఫారంపాండ్ నిర్మాణ పనులకు శ్రీకారం

**భీమారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

వర్షపు నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి వినియోగించుకునేలా ప్రతి రైతు తమ పొలాల్లో ఫారంపాండ్ నిర్మించుకోవాలని ఒడ్యాడ్ గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ సూచించారు. నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఫారంపాండ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.





గ్రామానికి చెందిన పుట్ట రాజేందర్ తోటలో ఫారంపాండ్ నిర్మాణ పనులను సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ ప్రారంభించారు. వర్షాకాలంలో పొలాల్లోకి వచ్చే నీటిని ఫారంపాండ్‌లో నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫారంపాండ్లు నిర్మించుకోవాలని కోరారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నేటి నీటి నిల్వే రేపటి సాగుకు భరోసా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శైలజ, కారోబర్ గంగానర్సయ్య, ఉపాధి హామీ కూలీలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధుడి అదృశ్యంపై కేసు

**కొడిమ్యాల, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి)**

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొడిమ్యాల మండలం చింతల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి కొండ పోచయ్య అనే వృద్ధుడు ఈ నెల 7న ఉదయం 5 గంటల నుంచి కనిపించడం లేదని చుట్టుప్రక్కల వెతికిన ఆచూకీ లభించలేదని వృద్ధుడి కొడుకు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# కోరుట్లలో ఎలక్ట్రిక్ బైక్ పార్ట్స్ అండ్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

## - ఆధునిక సేవలకు మరో అడుగు..

## - ఒకే చోట స్పేర్ పార్ట్స్, సర్వీసింగ్ సౌకర్యం

## - ముఖ్య అతిథిగా పాల్గొన్న అజార్ భాయ్.. వైస్ చైర్మన్ షాహిద్, మౌలానా జాకీర్ హాజరు

**కోరుట్ల, సెప్టెంబర్ 08 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలో ఎలక్ట్రిక్ వాహన వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలోని ఆర్.బి. రెస్టారెంట్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బైక్ పార్ట్స్ అండ్ సర్వీస్ సెంటర్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గం సీనియర్ నాయకుడు అజార్ భాయ్ ముఖ్య అతిథిగా హాజరై సెంటర్‌ను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, మౌలానా జాకీర్, రిపోర్టర్ ముహమ్మద్ సుజాయిత్ అలీ తదితరులు కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులు మొహమ్మద్ అజీజ్, జుబేర్‌లకు అభినందనలు తెలిపారు.

### ఒకే చోట స్పేర్ పార్ట్స్, సర్వీసింగ్

ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అవసరమైన స్పేర్ పార్ట్స్, సర్వీసింగ్, రిపేర్ సేవలను ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రకాల ఎలక్ట్రిక్ బైక్‌లకు సంబంధించిన సాంకేతిక సమస్యలను గుర్తించి, వాటికి తగిన పరిష్కారాలను అందించే విధంగా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.



### ఎలక్ట్రిక్ వాహనదారులకు ఎంతో ఉపయోగకరం

పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్ట్స్ అండ్ సర్వీస్ సెంటర్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు సర్వీసింగ్, రిపేర్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, ఇకపై కోరుట్లలోనే అవసరమైన సేవలు పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు.

### నాణ్యమైన సేవలే ప్రధాన లక్ష్యం



కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన స్పేర్ పార్ట్స్, మెరుగైన సర్వీసింగ్, రిపేర్ సేవలను అందుబాటు ధరల్లో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు మొహమ్మద్ అజీజ్, జుబేర్ లు తెలిపారు. వినియోగదారుల నమ్మకాన్ని పొందే విధంగా సేవలను కొనసాగిస్తూ, భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అజార్ భాయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, మౌలానా జాకీర్,సుజాయిత్ అలీ తదితరులు నూతన సర్వీస్ సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకోండి

**ఎండపల్లి, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి**

మండలంలో రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ) నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ ఆదేశాల మేరకు గుల్లకోట ఏఈఓ లావణ్య, కొత్తపేట ఏఈఓ మౌనిక, గోడిసెల పేట ఏఈఓ సందీప్ వారి వారి క్లస్టర్ల పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని,అంతర్జాల సమూహ వేదికగా ఒక ప్రకటనలో పేర్కొంటూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇది అవసరమని తెలిపారు. పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందడంతో పాటు ఎరువులను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు కూడా రైతు గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు సమీపంలోని రైతువేదికకు వెళ్లి సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, సందీప్, లావణ్య, మౌనిక , రైతులు పాల్గొన్నారు,




# ఫార్మ్ పాండ్ల పనులను పరిశీలించిన ఎంపిడిఓ

**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి)**

కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామంలో చేపట్టిన ఫార్మ్ పాండ్ల పనులను ఎంపీడీవో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన ఎంపిడిఓ కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఫార్మ్ పాండ్ల పనులను ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సక్రమంగా చేపట్టాలని సూచించారు. కూలీల హాజరు, పనితీరును మెరుగుపరచడంతో పాటు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బంది, కూలీలకు సూచనలు చేశారు. పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, కూలీలకు నిరంతరం పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్ రెడ్డి, వార్డు మెంబర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.



# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళన

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**బుగ్గారం, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుగ్గారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల తీరును వ్యతిరేకిస్తూ బుగ్గారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, మండల యూత్ అధ్యక్షులు సిగిరి అంజిత్ కుమార్, ఓయూ జేఏసీ నాయకులు కండ్లె మదన్, గ్రామ శాఖ అధ్యక్షులు కోడిమ్యాల రాజన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బీర్పూర్ తిరుపతి, పలువురు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు నిరసనలో పాల్గొన్నారు.




# దళితులపై అనుచిత వ్యాఖ్యలు సహించబోము

## మల్యాల మండల అంబేద్కర్ సంఘం

**మల్యాల,సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి :**

దళితులపై అనుచిత వ్యాఖ్యలు సహించబోమని మల్యాల మండలం అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారు. అసెంబ్లీ సాక్షిగా దళిత స్పీకర్ కు జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తూ మల్యాల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు పూడూరు గంగస్వామీ మాట్లాడుతూదళితులు ఏ హోదాలో ఉన్న చిన్నచూపు చూస్తూ అవహేళనగా మాట్లాడుతూ అసభ్యంగా వ్యవహరిస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు చట్టాన్ని ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సంయమనం పాటించాం ఇక ముందు ఇలాంటి ఘటన జరిగితే చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎలా ఉంటదో చూపిస్తాం అని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వాక్యాలు చేసిన తాతా మధు ను వెంటనే బర్తరఫ్ చేసి తనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ముద్దమల్ల స్వామి,శనిగారపు తిరుపతి,దళిత నాయకులు మ్యాక లక్ష్మణ్,తాళ్ల హరినాథ్, మల్యాల రమేష్,మునుగురి ప్రతీప్,కట్కూరి సురేశ్,బెక్కం రాజ గంగయ్య,లంక గంగాధర్,దళిత నాయకులు పాల్గొన్నారు.



# పిలుపు సరే.. సమన్వయం ఏదీ..?

## - రాస్తారోకోకు కానరాని నాయకులు కార్యకర్తలు,

**ఎండపల్లి, సెప్టెంబర్ 8 ,ప్రజాజ్యోతి**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన గా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రాస్తారోకో పిలుపు ఎండపల్లి మండలంలో అంతంత మాత్రంగానే సాగింది. పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు ఘనంగానే ఉన్నప్పటికీ. క్షేత్రస్థాయిలో కార్యకర్తల హాజరు మాత్రం నిరాశపరిచింది. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రాజారాంపల్లి వద్ద నిర్వహించిన రాస్తారోకోకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాల్సి ఉన్నా.. కొద్ది మందితోనే కార్యక్రమాన్ని మమ అనిపించి ముగించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పార్టీ కార్యక్రమంపై సమాచారం కింది స్థాయి కార్యకర్తలకు సక్రమంగా చేరలేదా? లేక నాయకుల మధ్య జన సమీకరణలో సమన్వయం కొరవడిందా? అన్న చర్చ సాగుతోంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి లు హాజరైతే మాత్రమే వారి దృష్టిలో పడేందుకు అధికార పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరవుతారని, మరే ఇతర కార్యక్రమాలకు పిలుపు నిచ్చినా మాకెందుకులే అని మిన్న కుండిపోవడం అలవాటుగా మారిందని పలువురు కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. మరోవైపు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఎండపల్లి మండలం కేంద్రంగా రాజారాంపల్లి లో మినీ క్యాంప్ ఆఫీస్ నిర్మాణం చేసి ప్రజలకు మరింత చేరువగా పరిపాలనను, సంక్షేమ ఫలాలను అందించాలనే ఆలోచనతో ముందుకు వెళ్తుంటే ఎండపల్లి కాంగ్రెస్ పార్టీలో సమన్వయం లోపం కొరవడిందనడంలో అతిశయోక్తి లేదు.సొంత పార్టీ కార్యక్రమానికి కార్యకర్తలను సమీకరించడం లో విఫలమవడం స్థానికంగా రాజకీయ చర్చకు దారితీసింది. మండల స్థాయిలో పార్టీ నాయకత్వం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ.. ఆశించిన స్థాయిలో జనస్పందన కనిపించకపోవడం గమనార్హం.పిలుపు బలంగా ఉంది.. పాల్గొనే వారే కరువయ్యారు ,అన్నట్లుగా రాస్తారోకో సాగడం స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది. భవిష్యత్‌లో పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తలను ఏ మేరకు సమీకరించగలరన్నది ఇప్పుడు కాంగ్రెస్ మండల నాయకత్వానికి సవాల్‌గా మారింది. ఏది ఏమైనా ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి , ప్రతిపక్షాలకు దీటుగా విమర్శలు తిప్పికొడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తే మరోసారి అధికార పీఠం చేజిక్కించుకోవడం పెద్ద విషయం ఏమి కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# మల్లాపూర్‌లో విషాదం.. కుమారుడికి మెసేజ్ చేసి తండ్రి ఆత్మహత్య

## - భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం

## - మద్యానికి బానిసై అఘాయిత్యం

**మల్లాపూర్: 08 సెప్టెంబర్ ప్రజజ్యోతి**

కుటుంబ కలహాలు, ఒంటరితనం ఓ వ్యక్తి ఉసురు తీశాయి. ‘నేను చనిపోతున్నాను‘ అని కన్న కొడుకుకు మెసేజ్ చేసి ఓ తండ్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కుటుంబ నేపథ్యం: మల్లాపూర్ గ్రామానికి చెందిన భైరవేణి శ్రీనివాస్ (40) కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.కలహాలు: గత కొంతకాలంగా శ్రీనివాస్ తన భార్యతో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో సుమారు పది రోజుల క్రితం భార్యాభర్తల మధ్య మరోసారి వివాదం జరగడంతో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది.మనోవేదన: భార్య వెళ్లిపోవడంతో శ్రీనివాస్ అప్పటి నుండి ఇంట్లో ఒంటరిగా ఉంటూ, తీవ్రంగా మద్యానికి బానిసయ్యాడు.ఆత్మహత్య: కుటుంబ కలహాలు, ఒంటరితనంతో తీవ్ర మనోవేదనకు గురైన శ్రీనివాస్ సోమవారం తన కుమారుడు విగ్నేష్‌కు తాను చనిపోతున్నట్లు మొబైల్‌లో మెసేజ్ పంపాడు. అనంతరం గ్రామ శివారులోని దుబ్బగట్టు ప్రాంతానికి వెళ్లి ఓ టేకు చెట్టు కొమ్మకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.పోలీసుల దర్యాప్తు:విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్య దూరమవ్వడం, మద్యానికి బానిసవ్వడం వల్లే మనోవేదనతో తన అన్న ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తమ్ముడు భైరవేణి కిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు మల్లాపూర్ పోలీస్ స్టేషన్ యస్‌ఎచ్‌ఓ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.




# గణేష్ మండపాలకు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

## - ఎస్సై నరేష్ కుమార్

**కొడిమ్యాల,సెప్టెంబర్ 028,(ప్రజాజ్యోతి):**

వినాయక చవితి సందర్భంగా మండలంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు మండపాలకు సంబంధించిన వివరాలను పోలీస్ శాఖ సూచించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్సై నరేష్‌కుమార్ సూచించారు. కొడిమ్యాల గ్రామంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో బుధవారం సాయంత్రం 5 గంటలకు పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు సమావేశానికి తప్పనిసరిగా హాజరై పోలీసులకు సహకరించాలని కోరారు.




# తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్.డి పట్టా అందుకున్న కారం వనిత




**మేడిపల్లి, సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామానికి చెందిన డా. కారం వనిత(కాయితి వనిత )ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్.డి పట్టాను విజయవంతంగా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (స్వయంప్రతిపత్తి), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన పూర్తి చేసి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా పీహెచ్.డి కాన్వొకేషన్ పట్టాను అందుకున్నారు.డా. కాయితి వనిత నోవెల్ త్రీ పేస్ మల్టీ లెవెల్ ఇన్వెర్టర్ టోపాలజీ యూజింగ్ సిలికాన్ మాస్ఫెట్ ఫర్ గ్రిడ్ కనెక్టెడ్ అప్లికేషన్ అనే అంశంపై విశిష్టమైన పరిశోధన చేసి డాక్టరేట్




పట్టాను సాధించారు.ఈ పరి శోధనను ఉస్మానియా విశ్వ విద్యా లయం అధ్యాపకుల మార్గదర్శ కత్వంలో ప్రొఫెసర్ ఎం. చక్రవర్తి పర్యవేక్షణలో, ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్ సహ పర్యవేక్షణలో విజయ వంతంగా పూర్తి చేశారు.ఈ సంద ర్భంగా కుటుంబ సభ్యులు, బంధు వులు, స్నేహితులు, అధ్యాపకులు, గ్రామస్థులు, పలువురు ప్రముఖులు డా. కాయితి వనితకు అభినందనలు తెలియజేశారు. వనిత సాధించిన విజయం యువతకు, ముఖ్యంగా ఉన్నత విద్య పరిశోధన రంగాల్లో ముందుకు సాగుతున్న విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.భవిష్యత్తులో డా. కాయితి వనిత విద్యా, పరిశోధనా, సాంకేతిక రంగాల్లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు.

# బీఆర్ఎస్ నేతలు, ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్

కొడిమ్యాల,సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి):
అసెంబ్లీ ఆవరణలో సోమవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో కొడిమ్యాల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అలాగే జీతభత్యాల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన పలువురు ఆశా కార్యకర్తలను సైతం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.అసెంబ్లీ ముట్టడి, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై ఏ. నరేష్‌కుమార్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు అరెస్టులు చేసినట్లు పేర్కొన్నారు.

# తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

## - స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం



మల్లాపూర్ , సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి)
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కా కమలాకర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎల్కా కమలాకర్ మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధులు సభా మర్యాదలను, రాజ్యాంగ విలువలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు.శాసనసభ వ్యవహారాల్లో అభిప్రాయ భేదాలు సహజమే అయినప్పటికీ, స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజా ప్రతినిధి బాధ్యత అని అన్నారు.స్పీకర్ పదవికి గౌరవం ఉండేలా సభా మర్యాదలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్కా కమలాకర్ కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, శాసనసభ గౌరవం, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాజకీయ నాయకులందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా..

- ఘటనను తీవ్రంగా ఖండించిన జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు
- మహిళా ప్రజాప్రతినిధుల పట్ల దురుసు వ్యవహారం ప్రజాస్వామ్యానికి విరుద్ధం బీఆర్ఎస్ నేతలు
- బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్





కోరుట్ల, సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి
తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కోరుట్ల పట్టణంలో భారీ ధర్నా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ముందుగా బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

### పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం

ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు నల్ల దుస్తులతో నిరసనకు ప్రయత్నించిన సమయంలో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ క్రమంలో మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని, లాగడం, తోసివేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు.మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.



### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహిళా ఎమ్మెల్యేలపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల గొంతును అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలకు, ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ ధర్నాలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మహిళా నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కాంగ్రెస్ ఆగ్రహం

## - ఎమ్మెల్సీ తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలి

## - అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

## - పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్



**కోరుట్ల, సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ.. తెలంగాణ శాసనసభ గౌరవాన్ని, స్పీకర్ పదవి ప్రతిష్టను కించపరిచే విధంగా ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అవమానకరమైనవని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని, తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని గంగాధర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను కించపరచడమేనని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారని అన్నారు.స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

